# దండోరా

( నవంబరు, 1979లో ఇందిరా పార్కులో జరిగిన సాహిత్య గోష్ఠిలో
చదివిన కథలలో ప్రథమ బహుమతి పొందిన కథ )

- ఎ. ఎస్. జగన్నాథశర్మ

ఏడాదికేడాది మాట గుర్తు చేస్తూ గుండెల్లో గునపాలు గుచ్చేడు పకీరు. వచ్చేస్తూన్న వాణ్ని నిల దీసి, నిలబెట్టి ఏవేవో అన్నాడు. గొడ్డు మాంసం కండను వాడు కొరుకుతుంటే ఆ కండకు బదులు తన జబ్బో, బుగ్గో ఎందుకు కాకూడదన్పించింది. ముక్క ముక్కలుగా చితక్కొట్టేసి కాకులకి, గద్దలకి తనని గిరాటేసేస్తే బాగుణ్ణనిపించింది. బాధన్పించింది. అంతే! తర్వాత వాడిదగ్గర నయానా భయానా అన్నిటికీ ఒప్పుకొని తిరిగొచ్చేశాడు. తిరిగొస్తున్నప్పుడు చంకనున్న డప్పు మీద పేట పిల్లలు ఒక్కో దరువేసి అందకుండా పారిపోతుంటే క్షణం కోపం అన్పించినా మళ్ళీ ఆ క్షణమే ఆనందమన్పించింది రావులయ్యకి.

శీతాకాలం పొద్దు

సాయంత్రం ఆరేడు గంటలకే పేటలో ఇళ్లు ముడుచుకు పోయినట్టున్నాయి. ఇళ్ళల్లో దీపాలు చలికి కొరడు గట్టినట్టు సన్నగా నిలిచి వెలుగుతున్నాయి. అడుగులో అడుగు వేసుకుంటూ పాకలోనికి చేరుకున్నాడు రావులయ్య— చంకనున్న డప్పుని గోడకు తగిలించాడు. 'ఉస్సు'రని ముంజూరులో కూలబడ్డాడు. పెరట్లో ముత్యాలు గంజి కాస్తున్నట్టుగా వుంది. ఇంటినిండా పొగమయం. దేనికో ముత్యాల్ని కేకేసి పిలుద్దామని పూరుకొన్నాడు.

సరిగ్గా టైమయింది!

కాళ్లూ, చేతులూ లాగుతున్నాయి. దవళ్లు పీకుతున్నాయి. తలంతా అట్నుంచిటు ఇట్నుంచటూ తిరిగి పోతున్నట్టుగా వుంది. చెయ్యి లాల్చి జేబులోనికి పోనిచ్చి చిల్లర వెతికాడు రావులయ్య. స్పర్శకి పది నాణెం- అర్ధరూపాయి- పావలా పైసలతగిలాయి. అంటే ఎనభై అయిదు పైసలున్నాయన్న మాట! "సాన"నుకున్నాడేమో దిగ్గున మంచం మీంచి లేచాడు.

వెళ్ళి మందుకొట్టొచ్చాడు. వస్తూ—

"మిద్దిమీద కోడిపుంజు సద్దులాడింది
మిద్దిలోన ముసిలోడు ముద్దడిగాడు" అంటూ పదాన్నందుకొన్నాడు. ఆ పదం పేటలో స్ప్రింగులా రింగులు తిరుగుతూ అవతల బంద మీదుగా వెళ్ళి పోతూంది. తండ్రి పాట వింది ముత్యాలు. వచ్చి ముంజూరు గుమ్మం దరి నిల్చుంది. పల్చని దీపం వెలుగులో పసిమి రంగులో వెలిగిపోతూంది పిల్ల. అటు చూశాడు రావులయ్య. అడిగాడు—

"ఇంటో కేటే"

"ఉలవసారు"

"ఉలవసారొక్కటేనా! నంజుకొందికి ముక్కేట్నేదేటి?"

"ముక్కొండడానికి దబ్బులో ! ఎక్కన్నెన్ది నీ సుక్కకే సాల్దు మరి !"

"ఓసోస్ వూరుకోయే ! మీ అమ్మనాగ సతాయించకు"

"సర్లె దాసు బావొచ్చినాడు"

"ఏడి ?"

"మొదటాట సినిమాకెళ్ళాడు"

"ఏలొచ్చాడేటి ?"

"నాకేటెరుక" ముత్యాలు పెరటోకి జారుకొంది. పొయ్యిమీద కళాపెళా ఉడుకుతూన్న ఉలవసారుని మూత తీసి చూసింది. వేళ్ళు చురుక్కుమన్నాయి. నోటో ఉంచుకొంది వాట్ని. చలికి అక్కడే కొక ఎత్తిపెట్టుకొని కూర్చుంది.

"సినిమా వొగ్గీసినాక తిండికొస్తాడు దాసు బావ. ఉలవసారు ఏడేడిదొడ్డిస్తాను. వద్దు వద్దంటున్నా, సెయ్యెడ్డెట్టినా మండ మీద పోస్తాను.దానేడికి బావ సెయ్యి తెల్లటిది ఎర్రగా కవిలిపోద్ది" నవ్వొచ్చింది ముత్యాలుకి. నవ్వుకొంది. ఆ నవ్వు పెరటోంచి పాక లోనికి, పాకలోంచి ముంజూర్లోనికి ముంజూర్నుంచి మంచం మీది మనిషి కాళ్ళ దరికొచ్చి మోకరిల్లినట్టుగా నిలిచిపోయింది. రావులయ్యకి విన్పించిందా నవ్వు. "పిచ్చితల్లి" అనుకొన్నాడు.

నవ్వు నాలుగు రకాలు ! సంతోషంలో నవ్వొచ్చు. దుఃఖంలో నవ్వొచ్చు. సంతోషంలో దుఃఖంగా నవ్వొచ్చు. దుఃఖంలో సంతోషంగా నవ్వొచ్చు. ఎలా అయినా మనిషి ఎప్పుడూ నవ్వుతూనే వుంటాడు. కాని, కొందర్నవ్వరు. ఏ విధంగానైనా నవ్విద్దామన్నా అది ఫలించదు. వాళ్లు జీవితాంతం ఏడుపు కోసం పుట్టారేమో లేక ఏడుపే జీవితం అనుకొంటారేమో ! వాళ్లల్లో ఒకమె అంకమ్మ. అంకమ్మ రావులయ్య భార్య.

వర్షం వస్తే చూరు మీంచి చినుకులు ధారకట్టి కురిసినట్టు అంకమ్మ ఎప్పుడూ రావులయ్యని చూస్తే చాలు ! కన్నీరు మున్నీరుగా ఏడ్చేది. "దానేడుపే ఇంటిని తినేసింది" అనుకొన్నాడు రావులయ్య. అనుకొంటూ మంచం మీద వెల్లకిలా వాలి చూశాడు—పై ముంజూరు- ముంజూరులో చిరిగిన రెండు విసినకర్రలు- పెచ్చులూడొస్తూన్న గోడ- గోడ మీద డప్పు- డప్పుకెగువ వైపున దీపం- దీపానికిటువైపు ద్వారం- ద్వారానికి చేరబడి చీపురూ కన్పించాయి.

"అదిగలాగే అంకమ్మ దవ్వారానికి సేరగిలబడే" దన్పించింది రావులయ్యకి

అంకమ్మకి ఇరవైలోనే అరవై వయసొచ్చేసింది. ఓ గుంటని, గుంటణ్ణి కనేసి నీరసంగా జీవితంలో నిలబడింది. అదేం జబ్బో మనిషి రోజు రోజుకి కట్టెలా తయారయ్యేది.

రావులయ్య సినిమా హాల్లో పన్చేసే వాడు. నెలకి ముప్పై రూపాయల జీతం. పోస్టర్ అంటించిన తడకెను వెనక్కి కట్టుకొని డప్పుని వాయించడం—వీధి వీధి తిరిగి సినిమా ప్రచారం చేయటం వృత్తి. అదొక్కటే కాదు. అటు కోర్టు కేసుల్ని దండోరా వేయడానికి, ఇటు నవరాత్రోత్సవాల కార్యక్రమాల్ని ప్రజలకి తెలియజేయడానికి డప్పును వాయించేవాడు. డప్పు మీద దరువు పడితే అయిదు రూపాయల బేరం కుదిరిందన్న మాటే. వారిగే బొప్పాయప చెట్టుకి జిల్లేడి కొమ్మలు పూచీ అన్నట్టు అందులో దిందులో ఇందులో దందులో నన్నట్టుగా సర్దుకొంటూ రావులయ్య రోజులు గడిపేసేవాడు. అటువంటి రోజుల్లోనే అంకమ్మకి మాయదారి జబ్బు చేసింది. తెచ్చింది ఇంటిదాని జబ్బుకి, ఇంటివాళ్ల నోటికీ, సర్దొచ్చేదికాదు. లేమి తెచ్చిన అసహనంతో తెగ చిరాకు పడేవాడు. అంత జబ్బులో వున్నా పెళ్ళాన్ని కొట్టేశేవాడు. అలా కొట్టినప్పుడల్లా అంకమ్మ ఏవేవో దేవుకొంటూ ఏడ్చేది-

"కొట్టకు! న్నంపి! ఎందుకంటావా? నాన్నబ్బాక నైనా మీరు సక్కగుంటారేమోనని ఆశ! నానెలాగూ బతకను, ఈ మాయదారి జబ్బు నన్ను బతికి బట్ట కట్టిన్వదు. తెచ్చినకాడికల్లా నా జబ్బుకే పోతోంది మీరేటయినా తింటున్నా(రా? నేదే? సూడు! ఆ గుంటల్ని సూడు! పెందిలికానించి నోట్లి గర గరుసు క్కూర్చున్నారు. అయ్యోఁత్తాడన్న(వెడతాడనుకొంటూ. నానా నెగిసి నిప్పు రాజెయ్యనేను! రాజేసి ఇన్నూ గ్గింజలుడికించనేను. అందుకే(నా! కలిసిరా నోడితో కట్టేటి! వొగ్గీయండి! నన్నొగ్గీయండి! బగమంతుడా! తండ్రి! న్నునట్టికెళిపోవా? ఇంకా ఎన్నాళ్ల నాయనా!!" అంటూ-

అలా అంకమ్మ ఏడుపు ఆ పేటలోని అయిదు వీధులకు ఆస్తిగా మిగిలింది. పగలూ రాత్రి ఏడుస్తూంటే — ఏ అపరాత్రపుడయినా, ఏ ఆడదయినా లేచి ఒంటేలుకి మరుగుకని బంద వైపుకి పోవాలంటే అంకమ్మ ఏడుపు వాళ్లకి కాపలా కాస్తున్నట్టుండేది. భయం లేకపోయేది.

"ముండా జబ్బు ఏటోగాని తెగ బాధపడి పోతాం దమ్మా! లోన కుళ్లి పోతోంది గావోలు! తట్టుకోనేక ఏడుస్తోంది" అనుకునే వారు. అంతే మిగిలింది రావుఁలయ్యకి. సానుభూతి తప్ప, చేతి పైస ఇంకో చేతికందివ్వలేని బతుకులు వాళ్లవి. ఇంకేం యిస్తారని!

రావుఁలయ్యకి గతమంతా జ్ఞాపకానికొస్తుంటే బాధగా వుంది. మనిషి ముడుచుకు ముడుచుకొని ఇంత పిట్టలా అయిపోయి నాడులూ నరాలూ తెగి చచ్చిపోతే బాగుణ్ననుకొన్నాడు అనుకొన్నాడేగాని, దానిక్కూడ పకీరుగాడి అనుమతి వుండాలని గుర్తొచ్చి నిలువునా లేచిపోయి చేతుల్లో బుర్రొంచుకొని రోదించాడు.

అంకమ్మ జబ్బు నయం చేయడానికి ఎక్కని ఆస్పత్రి గుమ్మంకాని, డాక్టరు బాబు గుమ్మం కాని లేదు. చిల్లర చిల్లర అప్పులు పెరిగిపోయాయి. చేతికందిందంతా జాక్లరు గారి చీటీల పాలవుతుంటే విసుక్కునేవాడు రావుఁలయ్య. కాని, తప్పదు. అంకమ్మ బతకాలనుకొనేవాడు. దానికోసమే అన్నాళ్ళూ తెలిసినా నేరుకోనివాట్ని అప్పటికప్పుడు నేరుకొన్నాడు. పెద్దదొరల ఇల్లు వేలం పడుతుంటే - పరువు కోసం దప్పు వాగకుండా, రావుఁలయ్య నోరు కదపకుండా వాళ్ల ముట్టజెప్పే పదీ పదిహేనుకి దప్పుకన్యాయం చేసి దరువు మానేసేవాడు. అది తెలిసిన అవతల వాళ్ల కోపం చూపిస్తే - "కమించండి బాబూ!" అంటూ లుంగలు చుట్టుకు పోయేవాడు.

ఎన్ని చేసినా ఎంతచేసినా అంకమ్మ పరిస్థితి ఏం మారేది కాదు ఎవరో అన్నారు- "విసాపట్నం తీసుకెళ్ళరాదా!" అని దీంతో అదో ఇదో తేలిపోవాలని వద్దు వద్దంటున్నా, పాకని పకీరుదగ్గర తనఖా వుంచి మూడొందల ఏభై అప్పుతెచ్చి అంకమ్మని విశాఖపట్నం సాగనంపాడు. ఆ ఆస్పత్రి అందాన్ని, ఆడంబరాన్నీ చూసి అంకమ్మకు ఏడుపొచ్చింది. "ఇంక నాను లెగిసి తిరుతాను గావోలు" అనుకొని తృప్తిగా కళ్లు మూసుకొంది. మూసుకున్న కళ్లు విప్పలేదు మరి! అంకమ్మ అక్కడికక్కడే చచ్చిపోయింది.

ఏడాదికేడాది సంగతది. ఇంకా నిన్ననో మొన్ననో జరిగినట్టుంది. అంకమ్మ చచ్చిపోయినా, అంకమ్మ కోసం చేసిన అప్పు చచ్చిపోక చిలవలూ పలవలూ అల్లుకొని వడ్డీతోసహా (అదేఁవడ్డీవో)అయిదొంద లైంది. అయ్యి, క్షణక్షణానికి రావుఁలయ్యని పకీరు చేతిలో చంపేస్తూంది. ఆ సంగతినే గుర్తు చేశాడు పకీరు ఇందాకట్నే! ఏదో దప్పువేసి వస్తూన్న రావుఁలయ్యని నిలబెట్టి అప్పుతీర్చమన్నాడు లేదంటే ఇల్లమ్మమన్నాడు. ఆ పని తనుచేయకపోతే అతనే చేస్తానన్నాడు కోర్టుద్వారా! అది తల్చుకుంటూనే రావుఁలయ్య ఏఁపీ చెయ్యలేక గతాన్ని నెమరవేసుకొంటు

న్నాడు. మనిషికి మేకులమీద ముసుకుల్తో నిల్చున్నట్టుగా వుంది.

"నీ కొడ్డింటి మంతావేటి" అడుగుతూంది ముత్యాలు.

సమాధానం చెప్పలేదు రావులయ్య.

"టయామయిపోయింది. ఇంక సినిమా వొగ్గేత్తారు" అంది అలా అనటంతో దాసుబావ వచ్చేకే అన్నం తిందువుగాని అన్నది అంతర్లీనంగా ప్రతిధ్వనించింది. రావులయ్య ముత్యాలు వైపు చూశాడు. తన కూతురు ఏడు మల్లెలెత్తు తూగుతుందనిపించింది ఎందుకో!

"బేసి రాకుండా సూస్తుండు! గరకోళ్ళ పెద్ద బొట్టితో మాట్లాడి సిటంలో పారొస్తాను" ఛెంగున ముంజూరవతలికి గెంతింది ముత్యాలు. వెళ్ళిపోయింది.

గరకోళ్ళ పెద్దబొట్టి, ముత్యాలు ఇద్దరికిద్దరూ సలాగ్గా పొడవుగా రివటల్లాగుంటారు. ఒకదాన్ని చూసి ఇంకోదాన్ని చూడక్కర్లేదు కూడా! ప్రాణ స్నేహితులు. పుట్టుకలో ఒక్కరోజే తేడా! గరకోళ్ళ బొట్టి తోలేళ్ళ సంబరం నాడు పుట్టింది. ముత్యాలు సరిగ్గా అమ్మతల్లి పండుగ నాడు పుట్టింది. దాసు బావొచ్చాడని చెప్పడానికి కాబోలు వెళ్ళిపోతూంది పిచ్చిగుంట!

రాత్రి తొమ్మిదయింది. ఎగువీధిలో సాయిబు డోలక్ వాయిస్తున్నాడు. ఆ శబ్దం చచ్చిన శవం గుండెమీద బాదుతున్నట్టుగా భరించలేని నిశ్శబ్దంలో భయంకరంగా విన్పిస్తూంది.

తన గుమ్మం మీంచి దేవుడి రిక్షా ఎగుడు దిగుళ్ళగా చప్పుడు చేసుకొంటూపోతూంటే రావులయ్యకి నూకాలు గురించి అడగాలన్పించింది.

"బావు! మా నూకాలుగాడు రానేదేటింకా" అడిగాడు.

''నేదు! బేరం కోసం సినిమా ఆలుకెళ్ళాడు''

''ఆహాఁ'' అని నిట్టూర్చాడు.

ఆ కుటుంబానికి పెద్ద మనిషీ, రావులయ్యకి పెద్దదిక్కు నూకాలే! కొడుకన్న మాటేగాని, కొడుక్కన్నా ఎక్కువముసిలోడికి. తల్లిపోయినదగ్గర్నుంచీ కుటుంబ భారం వహించి లేనిదున్నట్టు, ఉన్నది లేనట్టుగా చక్రం తిప్పుకొస్తున్నాడు. కానీ, పరకా జాగ్రత్త చేస్తున్నాడు. ఊరకనే ఖర్చు చెయ్యడు. పకీరు దగ్గిర రిక్షా అద్దెకు తీసుకు లాగుతున్నాడు. రిక్షా లాగి లాగి ఏ రాత్రొస్తాడో! ఏమో! తండ్రి పక్కన సందుచేసుకొని పక్కలోనికి నూకాలు దూరుతూంటే రావులయ్యకి అదో అనుభూతి, కితకితలు పెట్టినట్టుగా వుంటుంది.

చలిగా వుంది, కాని, రావులయ్యకి అదేం పట్టినట్టుగా లేదు. చెదిరిన గోరీలా మంచంమీద ఏటవాలుగా కూర్చున్నాడు. కూర్చున్నట్టుగానే ఉన్నాడు కానీ, ఆలోచన్లు అతన్ని కుదిపేస్తున్నాయి.

దాసెందుకొచ్చాడు?

చెల్లెలు పెళ్ళికొప్పుకుందా!?

ముత్యాలుకి పెళ్ళవుద్దా!!?

దాసు తల్లి స్వయాన్న రావులయ్యకి తోడబుట్టిన అప్పచెల్లెలు. రక్తాన్ని పంచుకుపుట్టినా, రక్తసంబంధాన్ని తెంచుకొన్నది కాకపోయినా ఆరెంటినీ కాదనే వ్యక్తి. కారణం - తను కష్టాల్లో నున్నప్పుడు అన్నయ్య కన్నీళ్ళన్నా తుడిచాడు కాదన్న దుగ్ధ.

మొన్న మొన్నటి వరకూ ఈ వూళ్ళోనే పేటలో వుంటూండేది. మొగుడు మున్సిపాల్టీలో పన్చేసేవాడు.

పదీ పాతికా తెచ్చేవాడు. తనేవో ఊడుపులకని, చేని కోతలకని వెళ్ళి పావలో అర్ధో తెచ్చేది. దాసొక్కడే కొడుకు. ముగ్గురూ కలో గంజో తాగి గుమ్మంలోనే వుండేవారు తప్పా, ఏనాడూ గుమ్మం దిగి గుట్టు చెప్పుకోలేదు. కాని, మొగుడి కార్యం శృతి మించి రాగాన పడింది. తమ జాతిదాన్నే మొగుడు మున్సిపాలిటీలో ఓ దాన్ని వుంచుకొన్నాట్ట! 'రాసారీలు పోసారీలు జీతం అందివ్వటాలు అన్నీ అక్కడే జరుపుతున్నాట్ట. అదంతా రావులయ్యకి చెప్పి చెల్లెలు ఏడ్చిందోరోజు. బావని కలిసి బతిమాలి, బామ్మర్దమే కాక, బోధపర్చాడు కూడా రావులయ్య.

"రెండు కాసులు సంపాదించి కట్టుకొన్న దాన్తోనే కలకల్లాడేని రోజులివి తెచ్చుకొన్నది తనకే సాల్దు? కాని, వూరోళ్ళందరికీ పంచిపెట్టేత్తానని వూదర కొట్టే సాట్ట నీలాటోడే! అలాగుంది నీ యవ్వారం. దాన్ని కట్టుకొని దాన్నోగట్టుకు సేర్సనేనేదు. మళ్ళందులో దీన్నట్టుకొన్నావు ఇదే దరమంగా ఉందా? రిక్షాలో కూకొన్నోళ్లనే ఇంకా దించనేదుకాని పైపై బేరా లప్పుడే ఆడేత్తున్నావు పాసింజర్లతోటి. ఆలోసించు ఎటుకీ కల్సిరాదు నేనన్నానని కోపగించుకోక" అన్నాడు. అన్నది విన్పించుకోలేదు అవతలి బావ. విన్పించుకోక విన్పించనంత దూరంగా వుంచుకొన్న ముండని లేవదీసుకుపోయి ఎటో పారిపోయాడు. చెల్లెలు దిక్కులేనిదైపోయి నెత్తీ నోరూ మొత్తుకొంది ఆ సంగతి తెలిసి. "నాకే దోవా కన్పించటం నేదు" అని ఏడుస్తూన్న చెల్లెలికి రావులయ్య ఏదో తోవ చూపిస్తాడనుకొంది. అయితే అలాంటిదేమీ జరగలేదు. తన బతుకును చూసి తనే భయపడుతున్నవాడు ఇంకొకరి బతుకును చూడాలన్న ఆసక్తిని కోల్పోయాడు రావులయ్య.

చూస్చూసి మరిక పనికిరాదనుకొని చెల్లెలు అన్నతో ఎత్తిపోతల వరకూ తిట్టిపోసుకొని దాసుగాడితో వైజాగ్ వెళ్ళిపోయింది. అదటొట్టి పంచన్చేరి దాసుగాడికి నౌకిరీ చూసుకొంది. ఇద్దరికిద్దరూ హాయిగా ఇప్పుడు వైజాగ్‌లో వుంటున్నారు.

దాసు బబరుగా అంత పొడవు మనిషి. చిన్నప్పట్నుంచీ మనిషిలో నమ్రత హెచ్చు. ముత్యాలంటే అతనికి తెగ మోజు. 'పెళ్ళాడితే దాన్నే' అని పంతం పట్టి కూర్చున్నాడు. వద్దని వారిస్తూన్న తల్లిని 'పోపోస్' అంటున్నాడు. మొన్నామధ్య ఈ వూరొచ్చి తనకీ ముత్యాలుకీ పెళ్లి చేసేయమన్నాడు మామయ్యతో.

రావులయ్య ముందూ వెనుకా ఆలోచించి అది పద్ధతి కాదని చెప్పాడు - తల్లినొప్పించుకు రమ్మని వెళ్ళిపొమ్మన్నాడు మేనల్లుణ్ణి! వెళ్ళిన మేనల్లుడు వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ తిరిగొచ్చాడు. ఏమ్మోసుకొచ్చాడో ఏమో!

ముత్యాలికీ దాసంటే వెర్రి ప్రేమే! ఎప్పుడెప్పుడు అయ్య బావతో పెళ్ళిచేస్తాడోనన్నది ఎదురుచూస్తుంది చేసేస్తే చాలు! చిలకమ్మలా బావతో వైజాగ్‌కి ఎగిరిపోవాలనుంది.

అయితే రావులయ్య పిల్లదాని మనసును గ్రహించని వాడేంకాదు. తనకీ తెలుసు ముత్యాలు తన ముంగిటింక మూన్నాళ్ళయినా వుండలేదని. అందుకే ఆలోచిస్తున్నాడు. దాసుకీ, ముత్యాలుకీ పెళ్ళి చేసేస్తే దేవతలు పూలవాన కురిపించక పోయినా, తన గుండెలో గుబులు తీరుతుందనిపిస్తుంది. పెళ్లి చేసేయాలని నిర్ణయించుకొన్నాడు. నిర్ణయం తీసుకొని ఏవేవో ప్రణాళికలు వేస్తున్నాడు.

సినిమా వదిలేసినట్టున్నారు. పేటలో పిల్లలు జట్లు జట్లుగా వస్తున్నారు. పాటలు వల్లె వేస్తున్నారు. గెంతుతున్నారు. గుడిసెలో దాక 'తొంగొంది పోయినా' గుండెలో ఆనందం తొంగి చూడాలి వాళ్ళకి. అందుకే వాళ్లు సంపాదించే చిల్లర పైసలు- చిన్న వాళ్లయితే

సినిమా పాలు! పెద్ద వాళ్లయితే సారా పాలు! వాళ్లకి వాళ్లి సున్నకు సున్న! అందుకే అక్కడి వాళ్ల జీవితాలు 'మార్పు' అనే తొలకరికి మారు తాడుగుకీ నోచుకోవు మరి!

పకీరు ఇల్లు అమ్మమంటున్నాడు. లేదా తనేనా అమ్మేసి అప్పుతీర్చేసుకొంటానంటున్నాడు. తప్పదు! ఈ రెంటిలో ఏదో పనిచేయలేల సమర్థుడు వాడు. వేలం వెయ్యకముందే తను జాగ్రత్త పడాలి! ఇల్లు అమ్మేయాలి. పేరుకు పాకనుకున్నా పొందిగ్గానే కట్టుకొన్నాడు తను. ముంజూరు- ముంజూరు ముందు గుమ్మం, నట్టిల్లు -వెనక వంటిల్లు, పెరడు- ఎంత కాదనుకొన్నా ఏడొందలిస్తారు పేటలో ఎవరైనా! ఇస్తే పకీరు అప్పు అయిదొందలూ తీర్చేసి మిగతా రెండొందలుతో ముత్యాలు పెళ్లి ఘనంగా జరిపించే సాడు. చెల్లెలికి వరకట్నంగా నూటపదార్లు ఇచ్చేస్తే ఆ తల్లి ముఖం జిబ్బిరేకులా పొంగిపోతుంది. మిగతా సొమ్ము వివాహ ఖర్చు. ఉహ్!! అంచెలంచెలుగా ప్రణాళికలు వేసుక్కూర్చున్నాడు రావులయ్య.

ఇంతలో-

మలుపులో గండిగ్గా వుంటే తొంగి చూశాడు. నలుగురైదుగురు మనుషులు పెద్దగా కేకలేసుకుంటు న్నారు. అందులో పకీరు గొంతు చర్చి గంటలా మోగుతోంది.

దగ్గరకొచ్చారు.

నూకాలు! దాసు! పకీరు- వాడి మనుషులు;

"వచ్చినావురా బాబూ !" పలకరించాడు దాసుని రావులయ్య. దాసేదో సమాధానం చెప్పబోయేలోగా పకీరు అంతెత్తుకు లేచి వీరాంగం వేశాడు. ఎంతగానో రభస చేశాడు.

తన దగ్గర అద్దెకు తీసుకొన్న రిక్షాని నూకాలు లారీ ఏక్సిడెంటు చేయించాట్ట! ఫ్రంట్ వీలు, సైడ్ వీలు పిప్పి పిప్పై పోయాయ్ట. ఫలితంగా డబ్బు కక్క మంటున్నాడు.

ఎక్కడ తేరు ? రావులయ్యా, నూకాలు మొఖ మొఖాలు చూసుకొంటున్నారు. దాసు కలగ జేసు కోవట్లేదు ముందు అప్పే తీర్చలేదు. అందులో మళ్ళీ ఇదొకటి. కన్నీళ్లకు కడుపులో బాధగా కెలికే జ్ఞాపకాలు సాయమన్నట్టు! ముసిలోడికి కరచరణాలా డట్లేదు.

పాతప్పు- ఇప్పుడిదీ ఫైసలా చేయమంటున్నాడు- పకీరు వేగంగా. లేకపోతే పదేహేనోజుల్లో కోర్టువారి అనుమతి పొంది ఇంటిని వేలం వేస్తాట్ట! చెప్పి చెప్పి చిచ్చు పెట్టి పెట్టి వెళ్ళిపోయాడు. పదిహేనోజులు గడిచాయి!

ముత్యాలు పెళ్ళి విషయం ఏం చెప్పకపోతే దాసు వైజాగ్ వెళ్ళిపోయాడు, కొద్ది రోజుల్లో వస్తానని చెప్పి. నూకాలికెవ్వరూ రిక్షా అద్దెకివ్వలేదు- పకీరు చలవ్వల్ల. దొరికిన చిల్లరతో తప్పతాగి తందనాలాడుతున్నాడు ఇంట్లో రావులయ్య. బాధగా ఏడుస్తున్నాడు.

ఆ రోజు రానే వచ్చింది.

పకీరు కోర్టువారి అనుమతి పొందాడు. రావు లయ్య ఇల్లు వేలం వేస్తున్నారు పేటలో.

తూలిపోతూ పడిపోతూన్న, తండ్రిని వద్దని తనే డప్పు చేతపట్టుకొని వేలంపాట పాడుతున్నాడు నూకాలు!

డప్పు వాగింది.

ఆ శబ్దం ముత్యాలు గుండెను చీల్చింది. రావు లయ్యను బండను చేసింది నూకాల్ని ఉన్మత్తుణ్ని చేసింది.

కళ్ళ నిండా కన్నీళ్లు పెట్టుకొని చేతిని నిండుగా ఉపయోగించుకొని దండోరా వేస్తున్నాడు నూకాలు.

పిచ్చి డప్పు !

ఎవరెవరు ఏం అయిపోయినా, ఎన్నెన్ని ఎవరెవరి మీదికి ముంచుకొచ్చినా దానికి పట్టదుకదా! దానికి తెలిసిందల్లా వాగిస్తే వాగడం గెంతిస్తే గెంతడం. తనతో పాటు పదిమంది బతుకుల్నీ గెంతించడం. నడిబజారు కీడ్చడం. అంతే తెలుసు వెర్రిముండకి...